క్లుప్తంగా

ఎంఈవో-1గా రమేష్ బాధ్యతల స్వీకరణ



అడ్డతీగల ఎంఈవో-1 గా బాధ్యతలు స్వీకరించిన రమేష్

అడ్డతీగల: స్థానిక మండల విద్యాశాఖాధికారి-1గా కె.రమేష్(ఎఫ్ఏసీ) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో-2 పి.శ్రీనివాసరావు, ఎంఆర్‌సీ సిబ్బంది రమేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన జరిగేలా ఉపాధ్యాయులకు తోడ్పాటును అందిస్తామని తెలిపారు.

కరాటే పోటీల్లో రాజేంద్రపాలెం బాలికల ప్రతిభ



బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొయ్యూరు: జిల్లా స్థాయి కరాటే పోటీల్లో రాజేంద్రపాలెం బాలికల పాఠశాలకు చెందిన మూడో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. వారిని మంగళవారం పాఠశాల హెచ్‌ఎం గోపాలం, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ నెల 3వ తేదీ న విశాఖలో యారాడ బీచ్ సమీపంలో జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న తన్విత, వినీత, సింధు, సమీరాలు ప్రతిభ కనబరిచి, ప్రథమ స్థానంలో నిలిచారు.

బాలికలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

గంగవరం : బాలికలు క్రమ శిక్షణతో మెలుగుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు శ్రద్ధగా విని అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్థానిక ఎస్ఐ బి.వెంకటేశ్ అన్నారు. మంగళవారం కొత్తాడ కేజీబీవీలో బాలికలకు చట్టాలు, బాల్యవివాహాలు, పోక్సో, శక్తి యాప్‌లపై అవగాహన కల్పించారు. ప్రత్యేకాధికారి పద్మావతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: బాలికలు, మహిళల రక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తోందని ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు. నందివలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మంగళవారం ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశలను నేరవేర్చేందుకు బాగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. హెచ్‌ఎం సోరోమా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రాంగణాల్లో ప్రవేశ నిషేధం తగదు



తలారిసింగి పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పాడేరు రూరల్: పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థి,ప్రజా సంఘాల నాయకుల ప్రవేశం నిషేధించడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. తలారిసింగి పాఠశాల ముఖద్వారం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేసి, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలను దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసమే కూటమి ప్రభుత్వం ఇటువంటి జీవోలను జారీ చేస్తోందని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించి, ప్రభుత్వ విద్యకు తూట్లు పొడుస్తోందని దుయ్యబట్టారు. ఇటువంటి తప్పుడు జీవోలను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ,తనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ కల్పించాలి



జీపు జాతాలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు

దుంబ్రిగుడ: ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఆగస్టు 9న జరిగే గిరిజన దినోత్సవం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్న పడాల్, నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన జీపుజాతాలో వారు మాట్లాడారు. ఇచ్చిన హామీలను చంద్రబాబునాయుడు అమలు చేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ, ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కోకన్వీనర్ భాను, సీహెచ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత పలు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై పెను భారం మోపారు. అసలే భారీగా వస్తున్న విద్యుత్ బిల్లులతో సతమతమవుతుంటే ఇంకో వైపు స్మార్ట్ మీటర్లను బిగిస్తూ మరో దోపిడీకి కూటమి ప్రభుత్వం తెరతీసింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



స్మార్ట్ దోపిడీ

- స్మార్ట్ మీటర్లతో వినియోగదారులపై భారం
- కేటగిరి-2, 3 విద్యుత్ వినియోగదారులకు అధిక బిల్లుల షాక్

అరకు సబ్‌డివిజన్‌లో మండలాలు అరకులోయ, దుంబ్రిగుడ	
మొత్తం విద్యుత్ కనెక్షన్లు	28,700
కేటగిరి - 2 కనెక్షన్లు	1,500
కేటగిరి - 3 కనెక్షన్లు	06
ఇప్పటివరకు బిగించిన స్మార్ట్ మీటర్లు	200



అరకులోయలోని ఓ ఫొటో స్టూడియోలో అమర్చిన స్మార్ట్ మీటర్



గతంలో కంటే అధికంగా వచ్చిన బిల్లు

దుంబ్రిగుడలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు(ఫైల్)

అరకులోయటౌన్: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా సామాన్యుల జేబులకు చిల్లులు పెడుతోంది. మీటర్లు బిగించిన షాపుల విద్యుత్ బిల్లులు నెలనెలా రెట్టింపు రావడంతో వినియోగదారులకు షాక్‌కు గురవుతున్నారు. ప్రతి నెలా వినియోగిస్తున్నట్టే విద్యుత్‌ను వాడినా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన తరువాత రెట్టింపు బిల్లులు రావడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో దుకాణాలకు రూ. 500 వరకు బిల్లు వస్తే స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత రూ. వెయ్యి దాటుంతోందని, బిల్లులు కట్టలేకపోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు.

విద్యుత్ శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని అరకులోయ, దుంబ్రిగుడ మండలాల్లో మొత్తం 28,700 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కేటగిరి-2 కింద సుమారు 1500 మీటర్లు ఉండగా, కేటగిరి-3 కింద ఆరు మీటర్లున్నాయి. ఇప్పటి వరకు ఈ రెండు మండలాల్లో సుమారు 200 స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. గతంలో మీటర్ రీడింగ్ తీసే సిబ్బంది వచ్చి బిల్లులు ఇస్తే, నగదు చెల్లించేవారమని, ప్రస్తుతం సెల్ నంబర్‌కు బిల్లు మెసేజ్ వస్తోందని, ఆ మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించవలసి వస్తోందని వినియోగదారులు తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న బిల్లులు

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన తరువాత వచ్చిన విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు హడలిపోతున్నారు. గతంలో వ్యాపారులకు నెలకు సరాసరి రూ.500 వరకూ బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన తరువాత రెట్టింపు కంటే ఎక్కువగా రూ. 1,000 నుంచి 1,200 వరకూ బిల్లు వస్తోంది. సెల్‌ఫోన్ల మాదిరిగా ఇకపై ముందుగానే సొమ్ము చెల్లించి కరెంట్ రీచార్జి చేయించుకోవాలని, రీచార్జి ముగిసిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వార్తలు రావడంతో వినియోగదారులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. అయితే ఇంకా పోస్టు పెయిడ్ విధానం అమలులోకి రాలేదు.

మిన్నంటుతున్న నిరసనలు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీల నేతలతో పాటు ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే అధికారులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి

స్మార్ట్ మీటర్ల వల్ల వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. బిల్లులు అధికంగా వస్తున్నాయి. విద్యుత్ వినియోగంలో తేడా లేకపోయినా ఎందుకు నెల నెలా అధికంగా బిల్లులు వస్తున్నాయో అర్థం కావడం లేదు. గతంలో వచ్చిన బిల్లు కంటే స్మార్ట్ మీటర్ బిగించిన తరువాత రెట్టింపు బిల్లు వస్తోంది.

– కె.రవీంద్ర, వ్యాపారి, దుంబ్రిగుడ

విద్యుత్ రంగాన్ని అదానీ చేతిలో పెట్టారు



విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు అదానీ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. ప్రజా సంఘాలు ఆందోళన చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు ప్రజలపై మరింత అధికంగా విద్యుత్ బిల్లుల భారం మోపుతున్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని చెప్పిన వారే ఆ మీటర్లను బిగిస్తూ విద్యుత్ రంగాన్ని పూర్తిగా అదానీ చేతిలో పెట్టారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తాం.

– పొద్దు బాలదేవ్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

బిల్లులు అధికంగా వస్తే దరఖాస్తు చేసుకోవాలి

వ్యాపార, వాణిజ్య విద్యుత్ వినియోగాదారులకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తోంది. గతంలో కంటే బిల్లు అధికంగా వస్తే పాత బిల్లుతోపాటు ప్రస్తుత బిల్లు జత చేసి, దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం. ఆ బిల్లులను నర్సీపట్నం విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి పంపించి చెక్ చేసి, సమస్య పరిష్కరిస్తాం.

– సత్యనారాయణ, ఏఈఈ, విద్యుత్ శాఖ, అరకులోయ

'బోగస్ హామీలతో ప్రజలను మోసం చేశారు'



రఘునాథ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు రామ్మూర్తి, తదితరులు

అరకులోయటౌన్: బోగస్ హామీలతో ప్రజలను మోసం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వైఎస్సార్‌సీపీ అరకులోయ మండల అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి అన్నారు.మండలంలోని లోతేరు లో మంగళవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానిని సక్రమంగా అమలు చేయలేదన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో ప్రజలందరూ లబ్ధిపొందారని, కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశారని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించాలని సూచించారు.

లోతేరు పంచాయతీ కమిటీ

లోతేరు పంచాయతీ కమిటీ అధ్యక్షుడిగా జన్రా రఘునాథ్, ప్రధాన కార్యదర్శులుగా గుబ్బాయి జగన్నాథం, పాంగి ఆనందరావు, పట్టాసి కొండల రావు, బొరిబొరి రామూర్తి, మరో నలుగురు కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పల్సాసింగ్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావు, పార్టీ నాయకులు టి. సొనపాత్రి, జి.వెంకటరావు, శ్రీరాములు, కిల్లో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి

చింతపల్లి/ముంచంగిపుట్టు: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో చింతపల్లిలో తహసీల్దార్, ముంచంగిపుట్టులో తహసీల్దార్, ఎంపీడీవోలకు మంగళవారం జర్నలిస్టులు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చింతపల్లిలో పాత బస్టాండునుంచి తహసీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు.

విద్యా మిత్ర కిట్ల రవాణా చార్జీలు చెల్లించాలని వినతి



ఎంఈవోకు వినతి పత్రాం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

దుంబ్రిగుడ: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లకు సంబంధించిన రవాణా చార్జీలను చెల్లించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కన్నయ్య ఆధ్వర్యంలో ఎంఈవో శెట్టి సుందర్‌రావుకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులకు అందజేస్తున్న కిట్లను మండల కేంద్రం నుంచి సదరు పాఠశాలలకు తీసుకువెళ్లేందుకు ఉపాధ్యాయులు సొంత డబ్బులు చెల్లిస్తున్నారని చెప్పారు. ఆ రవాణా చార్జీలు ఇప్పటికే ఎంఈవోలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందన్నారు. అయితే ఉపాధ్యాయులకు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అందువల్ల ఆ చార్జీల నగదును వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయుల జీతభత్యాలు సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు కె. రఘునాథ్, మండల అధ్యక్షుడు శెట్టి బాలకృష్ణ, కార్యదర్శి ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరి విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



వాముగెడ్డ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రభుత్వ ఉద్యోగులు సంఘం నాయకులు

చింతపల్లి: గిరి విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చింతపల్లి తాలూకా ప్రధాన కార్యదర్శి అనిమిరెడ్డి శంకరరావు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.అనంతరం చౌడుపల్లి పంచాయతీ పరిధిలో గల వాముగెడ్డ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, రాత సామగ్రిని అందజేసి,పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంజయ్‌కుమార్,గసాడి పద్మనాభం, ప్రదానోపాధ్యాయులు సింహాచలం,ఏవో మధుసూదన్‌రావు,శోభన్‌బాబు,మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ఎస్.టి. రామారావు,ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుములు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

'మనమిత్ర వాట్సాప్'ను ఉపయోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జీకే వీధి ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో లవరాజు, సిబ్బంది

గూడెంకొత్తవీధి: మనమిత్ర వాట్సాప్ గవర్ననెన్స్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు.వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా పౌరసేవలు పొందవచ్చని తెలిపారు. మంగళవారం గూడెంకొత్తవీధిలో మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించారు. ఏవో ఇమ్మాన్యుయల్,సర్పంచ్ సుభద్ర, కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయటౌన్: మండలంలోని సుంకరమెట్టలో మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్‌పై ఎంపీడీవో అడపా లవరాజు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు 95523 00009 వాట్సాప్ నంబర్ ద్వారా ప్రభుత్వ సేవలు పొందవచ్చన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాలి



ఆదివాసీ అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు



రంపులలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గిరిజనులు

చింతూరు: ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాలని ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని చట్టిలో ఆదివాసీ జెండాను సర్పంచ్ రవ్వ భద్రమ్మ ఎగురవేశారు. అనంతరం అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలు, హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈనెల 8న నిర్వహించే చలో మారేడుమిల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు తిమ్మ సాయి, కాక సీతారామయ్య, పొడియం లక్ష్మణ్, తుర్రం రామయ్య, రాజయ్య, చంద్రయ్య, రామకృష్ణ, రాముడు పాల్గొన్నారు.

రంపచోడవరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్ల వరప్రసాద్‌రావు కోరారు. ఆయన మంగళవారం మాట్లాడారు. మహిళలు, యువత పాల్గొని ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలన్నారు.

గూడెంకొత్తవీధి: ఆదివాసీ సంఘం పిలుపు మేరకు మంగళవారం పెదవలస పంచాయతీ రంపులలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె. బాలయ్య,నాయకులు బాబురావు, కేశవరావు , గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ ప్రమీల

పాడేరు రూరల్: తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రమీల తెలిపారు. మండలంలో ఎంకే వీధి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టత గురించి వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు సూచించారు. ప్రతి కాన్పు ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలోనే జరిగేలా గర్భిణుల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

ముంచంగిపుట్టు: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని,ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్‌చంద్ర,వైద్యాధికారిణి గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలతోనే సురక్షిత ఆరోగ్యం పొందే అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టర్ సూపర్‌వైజర్ డి.జయభారతి అన్నారు.మంగళవారం చింతపల్లి సెక్టర్‌లో గల రామాలయం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే వీలైనంత తొందరగా తల్లి పాలు పట్టించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి (అరకులోయ టౌన్): మండలంలోని చిలకలగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో సుగుణ ఆధ్వర్యంలో తల్లిపాలవారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు.



ముంచంగిపుట్టులో తల్లిపాలు వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



చిలకలగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో సుగుణ

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దు



చింతూరులో విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందచేస్తున్న సీపీఎం నాయకులు



రంపచోడవరంలో విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామ పక్ష నాయకులు



బుట్టగూడెంలో ఏఈ కి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఎటపాక: ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు,సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం బుట్టాయిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏఈ సూరిబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కాక అర్జున్‌దొర మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు వద్దన్న కూటమి నాయకులు అధికారం రాగానే మీటర్ల ఏర్పాటును వేగవంతం చేస్తున్నారని దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఐవి,పులుసు బాలకృష్ణ,ఇరప అజయ్,వెంకట్రావు,బ్రహ్మం,రాముడు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపుతోందని, ఆ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బిల్లులు పెరిగి ప్రజలు గగ్గోలు పెడుతుంటే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతినెలా వివిధ రకాల సర్‌చార్జీలు వేసి బిల్లులు వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. విద్యుత్ చార్జీలు భారంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు సీసం సురేష్, పొడియం లక్ష్మణ్, సుబ్బారావు, నాగేష్, నాగార్జున, సుందరయ్య, వీరభద్రం పాల్గొన్నారు.

రంపచోడవరం: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని వామపక్ష ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం రంపచోడవరంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. వామపక్ష ప్రజావేదిక పిలుపు మేరకు ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం, అఖిల భారత రైతుకూలీ సంఘం, పీవోడబ్ల్యూ నాయకత్వంలో ఫారెస్ట్ తాణా నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యుత్ శాఖ ఏడీఈకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటి బుల్లబ్బాయి, వంజం జోగారావు, సత్యనారాయణ, పోలిన వెంకటకృష్ణ, పల్లాల లచ్చిరెడ్డి బాలురెడ్డి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

గుత్తులపుట్టు కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

పాడేరు రూరల్: గుత్తులపుట్టు కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ప్రకటించాలని గుత్తలపుట్టు మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల సాధన కమిటీ అధ్యక్షుడు వంతల సూరిబాబు మాట్లాడుతూ పాడేరు, పెదబయలు, హుకుంపేట మండలాల పరిధిలో గల 16 గ్రామ పంచాయతీలతో ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ సభ్యులు బాలకృష్ణ, రమణ, భాస్కర్,మహేష్,మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రాజవొమ్మంగి : మండలంలోని తెల్లకొండ ఆదివాసీ తండాలో నివసిస్తున్న 28 కుటుంబాల వారికి ఎన్‌హెచ్516ఈ సిబ్బంది మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు అందజేసిన ఆర్థిక సాయంతో వీటిని పంపిణీ చేసినట్టు సంస్థ ప్రతినిధులు భరత్, అనీష్, గంగాధర్ తెలిపారు.